
నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 21 జూలై 2024 | ADILABAD NIRMAL



ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్

## అప్పు రూ.59 వేలు.. మాఫీ రూ.3,734



తాంసి, జూలై 20 : పాలోడి రాంనగర్‌లో ఎకరం 18 గుంటలు భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నా. ఆదిలాబాద్ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.59 వేలు పంట రుణం తీసుకున్న. రుణమాఫీ చేస్తున్నట్లు పేరుతోపాటు నా ఫోన్‌కు మేసేజ్ కూడా వచ్చింది. రుణం రూ.59వేలు తీసుకుంటే మెస్సేజ్‌లో ఈ విధంగా రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం 'రైతు రుణమాఫీ-2024' కింద కేవలం రూ.3,734 మాత్రమే నా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని లేదా మండల వ్యవసాయాధికారిని సంప్రదించగలరు. మీ ఈ ఆనందంలో పాలు పంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉందని వచ్చింది. మెస్సేజ్ తప్పు వచ్చింది అనుకుని తీరా బ్యాంకుకు వెళ్తే రూ.3734 మాత్రమే వచ్చాయన్నారు. రుణమాఫీ అవుతదో కాదో ఏం చేయాలో ఏం అర్థం కావడం లేదు.

*- బిట్రుంగి హిమల, రైతు, పాలోడి, మండలం తాంసి.*

## పండించే ప్రతి రైతుకు రుణమాఫీ కావాలి..



తాంసి, జూలై 20 : సొంత భూమి ఉండి పంట పండించి దేశానికి అన్నం పెట్టే ప్రతి రైతుకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా అందించాలి. రేషన్ కార్డు ప్రతిపాదికన కుటుంబాలను గుర్తించడం అనేది సరైన పద్ధతి కాదు. బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ జరగాలి. రైతుబంధును వెంటనే విడుదల చేసి సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేయాలి. అలా కాకుండా అడ్డదిడ్డమైన గైడ్‌లైన్స్ విడుదల చేసి సగం మంది రైతుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తే మాత్రం రైతులతో కలిసి ఉద్యమం చేస్తాం.

*- సుకుమార్ పెట్కులే, మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.*

# రైతులకు రిక్తహస్తం



లక్షలోపు రుణం తీసుకున్నవారు **35,560** మంది

రుణమాఫీ అయ్యింది **12,477** మందికే..

## డీసీసీబీ, పీఏసీఎస్ సొసైటీల్లో 35 శాతమే రుణమాఫీ

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 65 శాతం మాఫీ కాలేదు..

- ఎందుకు కాలేదో స్పష్టంగా చెప్పలేకపోతున్న అధికారులు
- బ్యాంకుల్లో అర్హులు, అనర్హుల జాబితాలకు దిక్కులేదు
- అయోమయం, గందరగోళంగా అన్నదాతల పరిస్థితి



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్



పీఏసీఎస్ సొసైటీ

మంచిర్యాల, జూలై 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల వరకు రుణాలు తెచ్చుకోండి. అధికారంలోకి వస్తే వెంటనే మాఫీ చేస్తాం. రూ.2 లక్షల రుణం తీసుకుని ప్రతి రైతు ఇవాళే పోయి పైసలు తెచ్చుకోండి..'' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రైతులను రెచ్చగొట్టాడు. రూ.2 లక్షల రుణమాఫీ అంటూ బీరాలు పలికారు. డిసెంబర్‌లో చేస్తామన్న రుణ మాఫీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కార్యరూపం దాల్చలేదు. ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తున్న తరుణంలో చివరకు విడుతలవారీగా చేస్తామంటూ ప్రకటించారు. రూ.ఒక లక్ష వరకు రుణాలు తీసుకున్న వారికే తొలి విడుత మాఫీ అన్నారు. పోనీలే రూ.లక్ష వరకైనా మాఫీ చేస్తున్నారనుకుంటే దానికి సవాలక్ష కొర్రీలు పెట్టడంతో రాష్ట్రంలోని రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. రాష్ట్రంలో రూ. ఒక లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులు లక్షల మంది తొలి విడుతలో రుణమాఫీ కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చే సరికి రూ.లక్ష రుణాలు తీసుకున్న రైతుల్లో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని గణాంకాలు, క్షేత్రస్థాయిలోని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. అసలు రుణమాఫీకి ఏం ప్రాతిపాదికగా తీసుకున్నారు. లక్ష లోపు రుణాలు ఉన్న వారికి ఎందుకు మాఫీ చేయలేదు. ఇలాంటి అనేక ప్రశ్నలకు స్పష్టత కొరవడింది. బ్యాంకుల్లోనైతే పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితాలే తమ దగ్గర లేవని అధికారులు చెప్తున్నారు. రూ.లక్షలోపు రుణం మీ బ్యాంక్‌లో ఎంత మందికి ఇచ్చారు. వారిలో తొలి విడుతలో ఎంత మందికి మాఫీ అయ్యిందంటే మా దగ్గర ఆ జాబితా లేదంటూ చేతులు ఎత్తేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులైనా చెప్తున్నారా అంటే అదీ లేదు. ఇటు వ్యవసాయ అధికారులు, అటు లీడ్ బ్యాంక్ అధికారులు మాకేం తెలియదంటే మాకేం తెలియదని తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితాలో ఉన్న వారికి మాత్రమే మాఫీ చేస్తున్నామని చెప్తున్నారు. దీంతో రూ.లక్షలోపు రుణం తీసుకుని, అన్ని రకాల అర్హులుగా ఉన్నప్పటికీ రుణమాఫీ ఎందుకు కాలేదో స్పష్టత లేక రైతులు అయోమయంలో పడిపోతున్నారు.

### సొసైటీల్లో తీసుకున్నోళ్లకు బంద్

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు రుణాలు ఇవ్వడంలో కీలక భూమిక పోషించే డీసీసీబీ(జిల్లా కేంద్ర సహకార బ్యాంక్), పీఏసీఎస్ సొసైటీల్లో రుణాలు తీసుకున్న చాలా మంది రుణాలు మాఫీ కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే తీసుకుంటే డీసీసీబీల నుంచి నేరుగా 1,646 మంది, పీఏసీఎస్ సొసైటీల నుంచి 33,914 మంది రైతులు మొత్తం 35,560 మంది రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్నారు. వడ్డీతో కలుపుకుని రూ.183.21 కోట్లు రుణం తీసుకున్నారు. కాగా.. తొలి విడుతలో వీరిలో 12,477 మంది రైతులకు సంబంధించిన రూ.63.25 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే రైతులు తీసుకున్న మొత్తం రుణంలో 34.52 శాతం, రైతుల్లో 35 శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. మిగిలిన 65 శాతం మందికి ఎందుకు రాలేదు అనేదానిపై స్పష్టత లేకుండా పోయింది.

### క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్ సొసైటీలో 418 మంది రైతులు రూ.లక్ష లోపు రుణం తీసుకోగా, వీరిలో 127 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. చెన్నూర్ సొసైటీలో 448 మందికి 80 మందికి, తాండూర్‌లో 190 మందికి 42, లక్సెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ సొసైటీలో 297 మందికి 84, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి సొసైటీలో 749 మందికి 249, కాసిపేట మండలం ధర్మారావుపేట సొసైటీలో 317 మందికి 172, భీమిని సొసైటీలో 396 మందికి 40, జైపూర్ సొసైటీలో 194 మందికి 40, గుళ్లకోట సొసైటీలో 559 మందికి ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. నెన్నెల సొసైటీలో 197 మందికి 13, జన్నారం మండలం పొనకల్ సొసైటీలో 263 మందికి 87, వేమనపల్లి సొసైటీలో 530 మందికి 385 మంది రైతులకే రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అయ్యాయి.

- నిర్మల్ జిల్లా భైంసా సొసైటీ పరిధిలో 742 మంది రైతుల్లో 307 మందికే రుణమాఫీ అయ్యింది. దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి సొసైటీలో 193 మందికి, మంజులాపూర్ సొసైటీలో 801 మందికి 150, కుంటాల సొసైటీలో 550 మందికి 114, కడెం సొసైటీలో 981 మందికి 489 మందికే లక్ష లోపు ఉన్న రుణాలు మాఫీ అయ్యాయి. ● ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల సొసైటీలో 600 మందికి 349, తిర్యాణి సొసైటీలో 538 మందికి 462, సిర్పూర్(టీ) సొసైటీలో 824 మందికి 388 మందికే లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయి.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏ సొసైటీ తీసుకున్నా లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులందరి మాఫీ కాలేదు. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీనిపై డీసీసీబీలో పని చేసే ఓ ఉన్నతాధికారిని వివరణ కోరగా.. ఇతర బ్యాంకుల్లోనూ రుణం ఉన్న రైతులకు ఇక్కడ మాఫీ కాలేదు అని చెప్పారు. అలాంటి వారు సొసైటీల్లో ఎంత మంది ఉన్నారు. వాళ్లని మినహాయిస్తే అర్హులైన మిగిలిన వారికి ఎందుకు రుణాలు ఇవ్వలేదు అని అడిగితే మాత్రం ఆయన తమకు స్పష్టత లేదంటూ చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇస్తే తప్పా లక్ష రూపాయల లోపు రుణం తీసుకుని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణం మాఫీ ఎందుకు కాలేదో రైతులకు తెలిసే పరిస్థితి కనిపించడం లేదు.

**డీసీసీబీ, పీఏసీఎస్ సొసైటీల్లో రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతుల వివరాలు**

| జిల్లా | రైతుల అకౌంట్ల సంఖ్య | డీసీసీబీలో తీసుకున్న రుణం | పీఏసీఎస్‌ల్లో తీసుకున్న రుణం | మొత్తం రుణం (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 8,909 | 6,11,26,367 | 44,91,62,465 | 51.02 |
| ఆసిఫాబాద్ | 8,125 | 1,17,91,874 | 36,81,99,186 | 37.99 |
| మంచిర్యాల | 4,909 | 43,32,680 | 23,07,80,983 | 23.51 |
| నిర్మల్ | 13,617 | 2,19,303 | 70,65,84,973 | 70.68 |
| మొత్తం | 35,560 | 7,74,70,224 | 175,47,27,607 | 183.21 |



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# మోసకారి రేవంత్

## ఒకేసారి రూ.2 లక్షలు మాఫీ చేస్తామని మాట తప్పాడు

- అర్హులైన చాలా మంది రైతులకు రుణం మాఫీ కాలేదు..
- ఏ ప్రాతిపాదికన అమలు చేశారో తెలియడం లేదు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు ఒకే విడుతలో రూ.2 లక్షల పంట రుణాలను వంద రోజుల్లో మాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తర్వాత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన సభల్లోనూ దేవుళ్ల మీద ఒట్టు పెట్టుకుని ఒకేసారి మాఫీ చేయకుండా మోసం చేశారని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో అర్హులైన చాలా మందికి రుణమాఫీ వర్తించలేదని తెలిపారు. ప్రభుత్వం ఏ ప్రాతిపాదికన మాఫీ చేసిందో తెలియడం లేదని, పట్టాపాసు పుస్తకాలను పరిగణలోకి తీసుకోలేదని, రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబంలో ఒక్కరినే పంపిణీ చేసినట్లు తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో అర్హులైన రైతులకు మొండి చేయి చూపిందన్నారు. రుణాల రద్దు విషయంలో ప్రభుత్వం వద్ద స్పష్టత లేదని, తమ వివరాలను తెలుసుకునేందుకు రైతులు బ్యాంకు, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే తమకు ఏమి తెలియదని సమాధానం చెబుతున్నారన్నారు.

### రూ. 565 కోట్ల రైతుబంధు

ఆదిలాబాద్ జిల్లాలో 1.17 లక్షల మంది రైతులు బ్యాంకు రుణాలు కలిగి ఉంటే కేవలం 18,634 మందికి రూ.120 కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో 1.64 లక్షల మంది రైతులకు రూ.565 కోట్ల రైతుబంధు సాయం అందించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ రూ. ఒక లక్ష రుణ మాఫీ కోసం రూ.45 వేల కోట్లను వెచ్చించిందని, రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు ఖర్చు అవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారని మండిపడ్డారు. చారాన కోడికి బారాన మసాల అనే తీరులో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహార శైలి ఉందన్నారు. వానకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, రైతుభరోసాలో భాగంగా ఎకరాకు రూ.15 వేల ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభిప్రాయ సేకరణ పేరిట జాప్యం చేస్తుందన్నారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సెవ్వ జగదీశ్, విజ్జిగిరి నారాయణ, మార్సెట్టి గోవర్ధన్, నవాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రెడ్ అలర్ట్

## ఆదిలాబాద్ జిల్లాకు భారీ వర్ష సూచన

- అత్యవసరం అయితే తప్పా బయటకు రావద్దు..
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
- అందుబాటులో డీడీఆర్‌ఎఫ్ బృందాలు
- సంప్రదించాల్సిన నంబర్లు 08732-226246, 8712659906
- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూలై 20 : ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు(రెడ్ అలర్ట్) కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన దృష్ట్యా.. పోలీసులు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు తలెత్తకుండా చూడాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. శనివారం ఎస్పీ ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసర సమయాల్లో తప్పా బయటికి రాకూడదని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్, పోలీసు ముఖ్య కార్యాలయంలో 08732-226246, 8712659906 నంబర్లకు సంప్రదించాలని కోరారు. నూతనంగా శిక్షణ తీసుకున్న డీడీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించే సమయాల్లో ప్రజలు వాటిని దాటకుండా ఉండాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని పేర్కొన్నారు. పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలు, వైర్లను చేతులతో తాకకుండా ఉండాలని సూచించారు. చెట్లు, శిథిలావస్థలో ఉన్న పాత భవనాల కింద ఉండొద్దని సూచించారు. నీటి ప్రవాహం, వర్షం వల్ల ఏర్పడిన గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, సిబ్బంది అలాంటి ప్రదేశాల్లో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

### అప్రమత్తంగా ఉండండి..

**- ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, జూలై 20 : నిర్మల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ప్రకటనలో తెలిపారు. రానున్న 24-48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు వరదలో చిక్కుకున్నట్లయితే డయల్ 100, స్థానిక పోలీసులకు లేదా కంట్రోల్ రూం 8712659555కి ఫోన్ చేసినట్లయితే తక్షణ సహాయం అందిస్తారని తెలిపారు.



కడెం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

## కడెం గేట్లు ఎత్తివేత

కడెం, జూలై 20 : విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో శనివారం అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువనకు విడుదల చేశారు. కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు(7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 690.400(5.345 టీఎంసీలు) అడుగులకు చేరాయి. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 15,338 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి దిగువరకు 11,022 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పరిస్థితిని సీఈ, డీసీఈ, ఈఈ పర్యవేక్షిస్తున్నారు.



పొచ్చెర



మైసమాల్



ఫారేఖాతి



గుండాయి

# జల సవ్వడి..

ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. కొండలపై నుంచి వర్షపు నీరు జాలువారుతోంది. నార్నూర్ మండలంలోని ఫారేఖాతి, గుండాయి, గాదిగూడ మండలంలోని ఝరి గ్రామ సమీపంలోని మైసమాల్, బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. నీటి సవ్వడితో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. కాగా.. అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు పొచ్చెర జలపాతాన్ని మూసివేస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సందర్శకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

*- బోథ్/నార్నూర్, జూలై 20*